

# పరువు

మోచెర్ల ఆంజనేయబాబు

అతగాడు కండ్లమీదకు ఎండ తగలకుండా కట్టిన చింకి తలగుడ్డను సరిచేసుకుని ఆకులు రాలిన చెట్టుక్రింద, రెండు క్షణాల నీడన ఆగాడు. ఎదురుగా ఉన్న గుడిసెల్లోకి చూచాడు. గూడెం మధ్యలో ఉన్న గుడిసెలో సన్నని మంట – ఆ వెలుగులో యిటు అటు కదులుతున్న అవయవాల ఛాయల్లో మనుష్యులు మెదులుతున్నారనిపిస్తున్నది. ఎండ వేడిమికి మసకలు కమ్మిన అతని దృష్టికి విలక్షణత ఏర్పడింది. చూచి గుర్తించేకన్నా గాలి వాలును జూచి పసికట్టాడు. పొయ్యిమీద కుతకుతలాడుతూ ఏదో ఉడుకుతున్నది. ఎదుట్లు తినేవాడి ఆకలంతా మిన్నగా ఏలా దహించే ఆకలి వేప నాల్కలతో పెల్లుబికింది. న్యాయానికి నామాలు పెట్టి, శిక్ష కందకుండా తప్పించుక తిరుగుతున్నాడు. పారిపోతున్నాడు. క్షణం ఒక చోట నిలవకుండా, ఊరికొక పేరుచెప్పి, పుట్టినచోట పదికెడు ఎంగిలిపడుతున్నాడు. బ్రతకటానికొక మార్గంలేదు. నడవటానికొక త్రోవలేదు. గాలి సవ్వడికే బెదరి, వెనక్కి తిరిగి చూచుకుంటూ ప్రయాణించాడు. ఆ బెదరుచూపుల్లో కర్కశత్వం మిళితమైఉంది. ఆ కర్కశత్వానికి మొనదేలిన బాకు పైపిడికి పెనవేసుకున్న ఇనుపపిడికిళ్లా, ధృఢత్వం ఉంది. గతికిన చోట గాని, కూర్చున్నా గాని, ఏమరక ఒక చేయి కత్రమీదనే ఉంచాడు. నోరు, చేయి వాటి పనిలో యాంత్రికంగా నిమగ్నమైవున్నా, పంచేంద్రియాల భావనావలయం అతని చుట్టూ పరిభ్రమిస్తూనే వుంది.

ఆకలి దహించుకపోతున్నది. కారాగారం మళ్ళీ తనకు ఆవాసమైతే— అయితే ఏమౌతుంది? కూటికి, నీడకు కొంత ఉపశమనమన్నా లభిస్తుంది. ఎన్నాళ్ళని ఈ దొంగతిరుగుడు? తరువాత సంగతి దేవుడెరుగు. ముందీ ఈద్బాధ నుండి తేరుకుంటే సరి. ఆక్కడికి వెళ్ళి ఒక ముద్ద యాచించితే— వేషం మార్చి పనిచేసుకొని బ్రతికితే— పని ఎవరిస్తారు? పనికి కుదిరినా – వయసులోనే నడుం వంచి ఎరుగడు. ఇప్పుడు జవసత్వాలుడిగిపోతున్నవి. ప్రశాంతత దక్కుతుందా? ఏది ఎలా ఉన్నా ప్రస్తుతానికి రెండు ముద్దలు దొరికితే తరువాత గడవట మేలావో చూచుకోవచ్చు. రెండడుగులు ముందుకు వేశాడు. ఆకలి లాగుతున్నది. కాళ్ళు కంకాళాన్ని ఈడ్చుకుని ముందుకు పోసాగినవి. గుడిసెముందు ఆగాడు.

"ఎవరు?" గుడిసెలోనుండి బయటకు వస్తూ ఓ స్త్రీ ప్రశ్నించింది. "ఏం కావాలి?" చూరుక్రింద నిల్చుని అడిగింది.

"ఒక ముద్ద పెట్టమ్మా. భగవంతుడు మిమ్మల్ని రక్షిస్తాడు. ఎంతో దూరం నుంచి నడిసొస్తున్నా ఎండలో" మెత్తగా, దీనంగా మాట్లాడటానికి ప్రయత్నించాడు.

ఆమె ఒక్కక్షణం నిశితంగా, నమ్మకంలేనట్లుగా అతని మొహంలోకి చూచింది.

"కూకో. పెడతా" నంటూ లోపలికి పోయింది. గుడిసెలమధ్య నీడ వెతుక్కుంటూ వచ్చిన ఊరకుక్క అగంతకుణ్ణి చూసి ఆగి "గుర్ర్" "గుర్ర్" మన్నది. బయటకి వచ్చిన స్త్రీని చూసి ప్రక్కకుపోయింది.

నరసిమ్మకు కడుపు నిండింది. చెంబెడు నీళ్లు త్రాగి గర్రున త్రేన్చే సరికి ఒళ్ళు బరువెక్కింది. ఒక్కక్షణం కన్నుమూస్తే బాగుండుననిపించింది.

"ఏ ఊరు పోవాలి?"

హాస్పిటల్‌నుండి విడుదలై వారం రోజులనుండి ప్రయాణిస్తున్నాడు. ఎక్కడికో అతనికే తెలియదు. తల దాచుకోవటానికి, తినటానికి వెనుకా ముందు తోడు ఏదీ లేదు. ఆకలితో అలమటిస్తున్న కారణాన పనిపాటలు చేసే ఓపిక కూడా సన్నగిల్లింది.

"నీ పేరట్సి?" వాడి స్థితిగతులు గ్రహించిన మరో ప్రౌఢవయస్క అడిగింది.

"నరసిమ్మ."

ఇప్పటివరకు జీవితంలో నరైన పేరు ఎవరికీ చెప్పలేదు. కడుపునిండి ఏమరుపాటులో నిజం చెప్పాడు.

ఆమె సాలోచనగా రెండుమార్లు ఆ పేరు అనుకున్నది.

"రత్తమ్మ మొగుడిపేరు నరిసిమ్మ కాదంటే?" అక్కడ చేరిన మరోకామెను ప్రశ్నించింది.

ఆ ప్రశ్న వింటూనే అతడు అదిరి పడ్డాడు. ఎండ వెలుగుకు ముకుళించుక పోయిన అతని ఫాలతలం విప్పారింది. ఒక్క క్షణం ఆగి—

"ఈ రత్తమ్మ పని సేత్తున్నదా?" అని అడిగాడు.

"రెడ్డిగారింట్లో పనిజేత్తుందది. పది పన్నెండేళ్ళ కూతురుంది. మొగు డొది లేసిందన్నారు."

"రెడ్డిగారింటికాడ ఉండారా."

"పట్నం బోయిందు. రత్తమ్మ గొడ్ల కొట్టంకాడ ఉందది."

"దేవుడు సల్లగా సూడాలి మా తల్లి" అంటూ లేచాడు.

పెదరెడ్డిగారి గొడ్ల కొష్టాలు కనుక్కోవటానికి అట్టే సమయం పట్టలేదు. రత్తాల్ని దూరంనుంచి చూచి గుర్తించాడు. బాగా ఒళ్లు చేసింది. ఒంటికి తగిన బాన బొజ్జ పెట్టింది. అమెకు అల్లంత దూరంలో పసితనపు మలుపు తిరుగుతున్న ఆమె కూతురు నిలబడివుంది. రత్తమ్మ పావిడి శుభ్రంచేస్తున్న కుర్రవాణ్ణి కేకలేస్తున్నది. పాటి పనివాళ్ళమీద దాష్టికం చేస్తున్నది.

తచ్చాడుతూ ఆమెను సమీపించాడు.

"నే గురుతున్నానా?"

ఆదాటు ప్రశ్నకు ఉలిక్కిపడ్డది. ఎదురుగా నిలబడిన ఆ మాసిన రూపాన్ని పరికించి ఒక్కక్షణం అవాక్కయింది. చేరువగా చేరి గుర్తించింది.

"ఎప్పుడొచ్చావ్? వదిలేశారా?" దుర్గంధపు పొరల్లో వెలిసిన సగం గ్రుడ్డి వికృత రూపాన్ని చూడగానే ఆమెకు వణకు పుట్టింది. అనాడు ఈనాడు వాడి రూపం ఆమెలో భయవిహ్వలను కలుగజేస్తూనే వుంది.

"ఏం జేత్తున్నా ఈడ?"

నరసిమ్మ చేతితో ముద్దచేసి నోరు తెరిచి మింగుతున్నట్లుగా సంజ్ఞ చేశాడు. వాడి చూపుల్లో హాస్యం, వెకిలితనం, ఏహ్యత మిళితమై లాస్యంచేశాయి. దొరికినంత వరకు పొట్టలో వేసుకుంటే, రెండు రోజులవరకన్నా అకలికి ఆదుకుంటుందని ఆత్రంగా మళ్ళీ కడుపునింపుకున్నాడు.

అర్థంకాకుండా ఉన్న ఈ సన్నివేశాన్ని అకళింపు చేసుకోవటానికి ప్రయత్నిస్తున్న కూతురును ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. ముద్దుగా, గోముగా నిమిరాడు. పసిదానిలా బుజ్జగించాడు. ఆ పిల్ల మృదువుగా తండ్రిని నెట్టి దూరంగా జరిగింది.

"ఇదొక్కతేనా?"

"ఇంకోదు గూడా" వాడి ప్రశ్న అర్థం చేసుకున్నట్లుగా సమాధానమిచ్చింది.

"పిల్లోడా?"

"ఔను"

వాడి నిశితమైన చూపులకు రత్తమ్మ ఒక్కమారుగా కోపగించుకుంది.

చేతులు త్రిప్పుతూ, "తొమ్మిదేండ్లయింది వదిలి.... దిక్కులేక వచ్చాం.... ఇంకేమౌతుంది?"

వెంటనే ఆమె నయనాలు అశ్రుపూరితాలైనవి. విస్ఫారమాడి ఏడ్వటం మొదలుపెట్టింది. నరసిమ్మకు కూడా కళ్లు చెమర్చాయి. జరిగినదంతా మోహన వ్రాసి పెట్టిందనుకున్నాడు. రత్తమ్మను చేరదీసి ఓదార్చ ప్రయత్నించాడు.

అతడు రత్తమ్మ కాపురంలో చేరిపోయాడు. ఆమె పెద్దరెడ్డిగారితో చెప్పి నరసిమ్మను పనిలో చేర్పించింది. అతగాడికి రాని విద్యంటూ ఏమీలేదు. కోళ్లు, గొడ్డు, తోట, దొడ్డి, పొలం— అన్ని పనులకు చేయికలిపాడు. "రత్తి మారు మొగుడు" "వెంపలచ్చి నరసింహుడు" ఇంకా ఎన్నెన్నో అన్వర్థనామధేయాలు క్రమక్రమేనా వాడుక పదాలైనవి.

"నే నెవడినో రత్తికి తెలుసు. ఈ ఎదవలకేం తెలుసు మనపెయ్యి ఎట్లాంటిదో" అనుకున్నాడు నరసిమ్మ. పదేళ్ళు దాటంగానే దొంగతనాలు మొదలుపెట్టాడు. మెడ బలుపెక్కగానే హత్యలకు దిగాడు. లాఘవం, లావు, తెగింపు తెలుసుకున్న తర్వాత త్రోవలు కాయటం, దోచుకోవటం, తలలు పగులకొట్టడంలో ప్రావీణ్యత పొందాడు. దోపిడీ ముఠాలకు నాయకత్వం వహించసాగాడు. దోపిడీలు చేతవనేగాని, నిశ్చింతగా, విశ్రాంతిగా కూర్చుని ఒక్క ముద్దయినా తినలేదు. పారిపోతూ చాటుమాటుగా తిరిగి తిరిగి ఇక్కడికి చేరాడు. అలసిపోతున్నట్లనిపించింది.

ఈనాడు రెడ్డిగారి ఆశ్రయంలో కడుపు నిండుతున్నది. రత్తి అనుబంధంలో నీడ దొరికింది. మదమెక్కి, దుర్మార్గపు పొలత్యంతో ఆకలి తీర్చుకోవటం, దివారాత్రి భయంతో పరుగులువారుతూ గడిపిన జీవితం తలచుకొని తనలో తానే వెర్రిగా నవ్వుకున్నాడు, పోలీసు నిఘా తప్పించుకోవటానికి కనీసం 20 ఆమడలన్నా దొంగత్రోవల ప్రయాణించాడు. ప్రస్తుతం పోలీసులకు తన ఊసు ఉండి ఉండదు. తనకు వారి బెడదలేదు. ఇదంతా రత్తి చలవ.

ఎప్పుడన్నా రత్తమ్మ మాట్లాడుతున్నదంటే, గతాన్ని నెమరువేసుకుని, ప్రస్తుతానికేది అన్వయిస్తుందో చూచి, తూచి మాట్లాడుతుంది.

"అయిందేదో ఆయ్యె. ఇంకెందుకు దాని సంగతి. ఇప్పుడు మనకాళ్లమీద మనం నిలబడ్డాం. నాలుగు డబ్బులు ఎనకేసుకుంటే పిల్లోళ్లకుంటాయి. మంచి పేరునుచూచి, కోర్టులో కేసు గెలిస్తే, దాని బయం తీరిపోతుంది. చెడుబుద్దులు మానుకో. నిన్ను అడుకూడా 'అయ్యా' అని పిలుస్తున్నారు. కష్టమో, సుఖమో

ఈడనే పనిచేసుకుంటూ, ఒక్కాడనే ఉందాం."

ఆమె మాటల్లో అర్థం అతనికి అవగాహన అవుతున్నది. దొంగతనాలకు, దోపిడీలకు, కారాగారవాసానికి అలసిపోయాడేమో, ప్రస్తుతం తలమునకగా విజాయితీపరుడైనాడు. పూచికపుల్ల వయినా విశ్వాసంగా తీసి చీపురులో దోపుతున్నాడు. ముగ్గురు జీవులను తన అక్కున చేర్చుకున్నాడు. రత్తమ్మ మాటలు, ప్రేమగా తన్ను అర్థిస్తున్నట్లున్నవి.


"యిద్దరం కలిసి సంపాయించుకుంటున్నాం. రెడ్డిగారి ఎనకమాల, ప్రతోడు కూనంతా తింటూనే ఉన్నాడు. అందరికన్నా మనమే పనెక్కువగా సూత్తున్నాం గదా! మనం కొసింత తింటే నాయుదేమి అనకోడు. నీ వొచ్చిన తరువాత అన్ని పనులకు సాయంగా ఉండావు. మేస్త్రీగా ఉండదగ్గోడివి. మనం పెళ్ళి చేసుకుంటే పరిపోలా. అందరూ మన ల్నంటున్నారు" అంటూ గునిసింది.

పదివయసు దాటుతున్న రత్తమ్మ మాటలు నరిసిమ్మకు అర్థరహితంగా తోచినవి. దానికి తనకు పెళ్ళేమిటి? దాని మెళ్ళో తాను తాళిగట్టాలా? ఎన్ని సాకులు చెప్పినా తాళిగట్టమని పీకులు చదువుతూనే ఉన్నది. మొండి మనుషులను గూడా మాయజేసే మంత్రం దీని దగ్గర ఉందనుకున్నాడు. తాళిగట్టాడు. నరిసిమ్మ మేస్త్రీ అయినాడు.

రెడ్డిగారితో చెప్పి పాక పెద్దది చేసుకున్నాడు. అయన మంచితనంతో యింట్లో కుండలు నిండుగానే వున్నవి.

మిగతా పనివాళ్ళను అదుపాజ్ఞల్లో పెట్టి శుద్ధంగా పనిపాటలు చేయిస్తున్నాడు. పిడికెడు గింజలుగూడా వృధగా పోనివ్వటంలేదు. పెద్దకామందుకు బాగా లాభాలు కలిగాయి. "నాయంగా ఉంటే ప్రతోడికి సుఖంగా ఉంటుందే రత్తీ" అన్నాడు రెడ్డిగారు. ఇరుగుపొరుగు నా యుడమ్మలకు నరిసిమ్మ గురించి "విజాయితీపరుడు" "అచ్చితమైన మనిషి" "ఏమరుపాటులేని కాపు" అంటూ ఉగ్గడించి చెప్పాడు.

నిజంగానే నరిసిమ్మ మనిషి మారాడు. పైఊళ్ళ నుండి నాట్లకు, కోతలకు వచ్చిన మోటు గుంపులను మెడలువంచి పని చేయించాడు. ఆ మాత్రం కట్టుబాటుకనం తెలియకపోతే మురాలకు నాయకత్వం ఎలా నిర్వహించగలిగాడు? నరిసిమ్మ శాసనానికి తట్టుకోలేక మొదట్లో బెదరించారు. తిరగబడ్డారు. హత్యలకు, దోపిడీలకు అందెవేసిన నరిసిగాడొకడుండే వాడని వినికిడితో మేస్త్రీ మొహంలోకి "పీడెనా" అన్నట్లు చూచారు. పాటుతెలిసి కర్ర మసయోగించటంలో, లంఘించి ఎదురుమనిషిని చావుపోటు పొడవటంలో, బలానికి, ఊపుకు వాడికి సాటిలేదని నిరూపించుకున్నాడు. ఎంత బెదిరి చిందులు




క్రొక్కే గొడ్డయినా వాడి జబ్బ చవి చూచిందంటే, దిమ్మెరబోయి క్రింద పడాల్సిందే. నరిసిమ్మ లౌక్యం, చాకచక్యం, విగ్రహం వారిలో అతనిమీద స్నేహభావం పెంపొందింపజేసింది. ఒడ్డు పెరిగినవాడి దండకు, నేరం, మోసం తెలియని ఆ పాటకజనం భయభక్తులతో గౌరవాన్నిచ్చింది. వాడితో స్నేహాన్ని ఆశించింది. నరిసిమ్మ, నరిసిమ్మయ్య కాపుగా వాడుకలోకి వచ్చాడు.

రత్తమ్మ తన మగవాడి తెలివితేటలకు ఉబ్బి తబ్బిబ్బులౌతున్నది. మొట్టమొదటి సారిగా నరిసిమ్మలో రాజసాన్ని, అధికార దర్పాన్ని చూచింది.

"నీ కరమ. సదువులేక యిట్లా అయినావుగాని, సదువుకనుంటేనా, మిలటరీ ఆపీసర కాకపోయినావా!" అన్నది.

"మిలటరీ ఓడేంటి! ఊళ్లేలక పోయినాడా!" అన్నాడు దూరంగా కూర్చుని చుట్ట చుట్టుకుంటున్న మరో ప్రబుద్ధుడు.

నరిసిమ్మ కూతురు సౌభాగ్యానికి పదిహేనుఏండ్లు నిండాయి.వయసుతో ఒరిపిడి పట్టిన సొంపులు నిగ్గులు తేలుతున్నవి. కూతురుని చూచి మురిసిపోతున్నాడు నరిసిమ్మ. నీలపుటాకాశంలో మొదటిరోజున మొలకెత్తిన శుక్లపక్షం నెలవంక అనుకున్నాడు. ఆ నడకలో లయ, మాటల్లో న్యవనం, రెడ్డిగారి చూపులను ఆకట్టుకున్నవి. అందుకు సందేహమే లేదు.

మీగడ కడుతున్న పాలను పిల్లి నోటికందించటానికి, అంతరాన్ని చేరువకు ప్రోగుచేయాలని రత్తమ్మ ఊహల్లల్లుతున్నది.

ఒకరోజు మురిపెం కురిపిస్తూ, నిండుగా దరహాసం వెదజల్లుతూ నరసిమ్మ ప్రక్కకు చేరింది. గుసగుస సంగతి వెళ్ళబెట్టింది.

"మనకు ఎండి, బంగారం యోగం పట్టబోతున్నయ్. రెడ్డెమ్మ సూపులు పై బెగ్గం మీదికి మళ్ళుతున్నాయ్."

"ఓరి బెగమంతుడా" అని అరిచాడా జండిపోటు. "దాన్ని గొంతు పిసికి సంపనైనా సంపుతానుగాని, అమ్ముకోను."

ప్రేమలను, డబ్బులను ఒక్క త్రోవ్వు తోసి. రత్తమ్మను తిట్లతో, తాపులతో చాప చితకపాడాడు. నరసిమ్మకు కోపంతో కొట్టి కొట్టి రొప్పువచ్చింది. ఎక్కిళ్ళు పెట్టి ఏడ్చింది రత్తమ్మ. పాతగుడ్డల మూటలా నేలమీద దొర్లింది.

రోజులు గడుస్తున్నవి. రత్తమ్మ తాపులు కాస్తూనే ఉన్నది. నరసిమ్మ మనసు మారుతుందేమోనని ఓపికపట్టి, కుములుతున్నది.

"నీ ఎదవ మాయలకు లొంగుతాననుకుంటున్నావేందే! సిగ్గులేని పనులు సేసి సంపాయిద్దామనుకున్నా! మళ్ళీ పాతదోవ పట్టినానంటే తలకాయలు పగలనూకి, సంపాయించక తింటా...."

కోపావేశం తగ్గి, మెదడు కొంత చల్లబడింది. "సదువు, గౌరవం అని ఆలోసించటమే తప్పుడిది. దోపిడీలు, దొంగతనాలు సేశా. అడ్డంవచ్చినోల్లను సచ్చేట్టు కొట్టా. నిజమే. అప్పటి పనులకు ఈనాటికి ఏడుస్తుండా. నీ వేమనుకున్నా సరే. సేసింతరువాత ఎందుకు సేశానా అనుకునేవాణ్ణి. నే శెడ్డోణ్ణే. ఏం సేశినా ఆడదాన్ని అమ్ముకోని బతకలేదే. నీ కడుపు ఒంటిమీద సెయ్యేసినోణ్ణిగాను. నే తెలివిమాలినోణ్ణి, అనుకుంటావు, అంతేనా! నా సద్దతే అంత. అప్పుడు మగోడి పనులు సేశా. అప్పుడు ఆడదాన్ని అది సక్కలో సందబెట్టమంటావుచే గాచ్చసివమంటా! ఇదుగో, ఇనుకో, నీ రెడ్డి, నీవు నీ పిల్ల ఒళ్ళు దగ్గరుంచుకోని బతకండి. నన్ను మళ్లీ పాతతోవలు తొక్కించావా.... ఇంకా నరిసిగాడు బతికున్నాడనుకో జాగ్రత్త"

రత్తమ్మ గుడ్లనీరు కుక్కుకుంటూ చీరచెంగుతో కళ్ళొత్తుకుంది.

"అప్పటి నరిశిగాడు సచ్చిపోయాడు. నీ మాటలు, బుద్ధి మారిపోయినయ్. మా అందరికి గ్యానం నేరపటానికి నరసిమ్మయ్యవై వచ్చావు. మంచిగా బతుకుతాను. నిజం మావా! వెంకటేశ్వరసామి సమాజికంగా సెప్పుతున్నా".

నరసిమ్మ కాళ్లు పట్టుకొని పాదాలకు తల ఆన్చింది.

[ఒక స్పానిష్ కథ ఆధారంగా]